క్లుప్తంగా

నూజివీడు డీఎస్పీకి అభినందనలు



డీఎస్పీ కేవీ ప్రసాద్‌ను అభినందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : నూజివీడు డీఎస్పీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన కిలాని వీర వెంకట ప్రసాద్‌ను ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని క్యాంప్ కార్యాలయంలో డీఎస్పీకి పుష్ప గుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. వీరిలో చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కు సూరి గోపాలకృష్ణ,కిలారపు శ్రీనివాసరావు (బుజ్జి), గొర్ల రామారావు, చిట్టిబోయిన సాయిబాబు, బొట్టా అజయ్, సప్పా రాజు, ఆగొల్లు కృష్ణారావు, దాసరి స్వామి తదితరులు ఉన్నారు.

కొల్లేరుపై రెగ్యులేటర్ నిర్మించాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం తక్షణం కొల్లేరుపై రెగ్యులేటర్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం సభ్యులతో కలిసి కలకుర్రు శివారు పెదఎడ్లగాడి వంతెన వద్ద కొల్లేరు పరిస్థితిని పరిశీలించారు. ఇటీవల ముంపుబారిన పడిన కలకుర్రు గ్రామస్తులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రెగ్యులేటర్ నిర్మాణం వల్ల ఉప్పుటేరు నుంచి సముద్రం నీరు కొల్లేరులోకి చేరకుండా అడ్డుకోవచ్చని, కొల్లేరులో నీటి మట్టం కొనసాగించవచ్చని అన్నారు. గత ప్రభుత్వం దుంపగడప, మొల్లపర్రు, పడితడకల వద్ద రెగ్యులేటర్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించిందని గుర్తుచేశారు. నేటి ప్రభుత్వం రెగ్యులేటర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో కొల్లేరుపై ఏర్పాటుచేసిన మిత్ర, శ్రీరామకృష్ణయ్య కమిటీలు చేసిన సూచనలు అమలు చేయాలన్నారు. కొల్లేరును పరిరక్షించకపోతే భవిష్యత్ తరాలకు మత్స్య సంపద కరువైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిండు కుండలా ఉండాల్సిన కొల్లేరు అక్టోబర్ నెల నుంచి జూలై నెల వరకు చుక్క నీరు లేకుండా ఎండిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో కలకుర్రు పెద్దలు ఘంటసాల పెద్దిరాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేసులు ఎత్తివేయాలంటూ వినతి

ఏలూరు టౌన్: గత ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలంటూ ఏపీ ఎన్‌జీఓ నాయకులు జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్‌ను కోరారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీని నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు, పువ్వుల ఆంజనేయులు, గగ్గలోతు కృష్ణ, ఆదినారాయణ ఉన్నారు.

చెత్త తొలగింపుపై చిత్తశుద్ధి ఏదీ!

- ఏలూరు నగరంలో పేరుకుపోతున్న చెత్త
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు
- ప్రజలకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పరిధిలోని 50 డివిజన్లలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి గుట్టలుగుట్టలుగా దర్శనమిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులకు వెళ్లే మార్గం, చివరకు పోలీసు అధికారుల కార్యాలయాల బయట కూడా చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. ఇదేనా మంచి ప్రభుత్వం అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. నగరపాలక సంస్థలో అన్ని విభాగాలను సక్రమంగా పనిచేయించాల్సిన మేయర్, అధికారులు తాము చేయాల్సిన పనిని పక్కన బెట్టి అధికార పార్టీ నాయకులకు భజన చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంద రోజులు పాలన పూర్తయిన సందర్భంగా తమది మంచి ప్రభుత్వం అంటూ ఊరూవాడా డప్పులు కొట్టుకుంటున్న ప్రభుత్వం, దానిలో భాగమైన ప్రజాప్రతినిధులకు తమ బాధలు పట్టడం లేదంటూ నగర ప్రజలు వాపోతున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు

నగరంలో చెత్త సమస్య ఏ విధంగా ఉందనే దానికి నిదర్శనంగా ఏలూరు డీఎస్పీ కార్యాలయం బయట పేరుకు పోయిన చెత్త, చెదారంతో పాటు వాటి మధ్య తాగి పడేసిని బీరు బాటిల్స్ ఉన్నాయి. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్‌కు వచ్చే మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే ప్రజలు, వాహనచోదకులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎంతో రద్దీగా ఉండే పాత బస్టాండ్ ఎదురుగా ఆటో స్టాండ్ పక్కనే పెద్ద చెత్త కుప్ప దర్శనమిస్తోంది. దీంతో ఆటోలు ఎక్కేవారు, బస్సులు దిగే వారు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎస్‌ఆర్‌పేటలోని ఆసుపత్రి, కాలేజీలు ఉండే ప్రాంతానికి వెళ్లే మార్గంలో చెత్త కుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. వీటన్నింటినీ తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.



పాతబస్టాండ్ సెంటర్‌లోని ఆటో స్టాండ్ వద్ద మెయిన్ రోడ్డు పక్కనే పేరుకు పోయిన చెత్త



నరసింహరావుపేట సిరి ఆస్పత్రి రోడ్డులో పేరుకుపోయిన చెత్త



శాంతి నగర్ 9వ రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్తా చెదారం

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ వహించాలి. పేరుకే ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వచ్చి వెళ్లే మార్గంలో అద్దంలా చేయిస్తున్నారు. ఆ ప్రాంతంలో చూపించే శ్రద్ధను ఇతర ప్రాంతాల్లో చూపడం లేదు. దీని వల్ల నగరంలో ఎక్కడబడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయి. తక్షణం చెత్త కుప్పలను తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

ప్రతిజ్ఞలకే పరిమితం



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దుతామంటూ ప్రజాప్రతినిధులు, అధికారలు ప్రతిజ్ఞలు చేశారు. క్షేత్రస్థాయిలో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దడం అంటే ఇదేనా? నిర్దిష్టమైన ప్రణాళికతో నగరంలోని ప్రధాన కూడళ్లల్లో చెత్తను తొలగించే విధంగా కార్పొరేషన్ అధికారులు పనిచేయాలి. స్వచ్ఛ ఏలూరు దిశగా పనిచేయాలి.

– బి.జగన్నాథం, సీఐటీయూ నాయకులు, ఏలూరు

ఒత్తిడిని జయించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నిత్య జీవితంలో ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలున్నాయని కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ కల్లా రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒత్తిడిని జయించే వివిధ మార్గాలను ఆయన సూచించారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి ఉత్తమమైన మార్గం వ్యాయామమే నన్నారు. వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్ హార్మోన్ విడుదలై మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని తెలిపారు. కనీసం రోజుకు 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలని, ఒత్తిడికి గురైనప్పుడు దీర్ఘశ్వాస వ్యాయామం చేయాలని సూచించారు. పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, తృణ ధాన్యాలు, సేంద్రియ ఆహార పదార్థాలు వంటి పోషకాహారం కూడా ఒత్తిడిని తగ్గించడంలో కీలకంగా పని చేస్తుందని వివరించారు. స్నేహితులు, బంధువులు, ఇష్టమైన వారితో ఎక్కువ సమయం గడపడం, విహార యాత్రలు, పర్యాటక ప్రాంతాల సందర్శన ద్వారా కూడా ఒత్తిడిని అధిగమించవచ్చని పేర్కొన్నారు.

నేడు 'అంత్యోదయ దివస్'

ఏలూరు (టూటౌన్): పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా గురువారం అంత్యోదయ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ శ్రీకర్‌బాబు తెలిపారు. ఏలూరు డివిజన్ పరిధిలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నరసింహారావు పేట, వెంకటరావుపేట, చేబ్రోలు, చింతలపూడి మరియు జీలుగుమిల్లి పోస్టాఫీసుల్లో ఆధార్ శిబిరాలు (ఆధార్ నమోదు, నవీకరణ) ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటన కోరారు.

సాదాసీదాగా కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య ప్రత్యేక సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ప్రారంభమైన కొద్ది సేపటికే ముగిసింది. ఏలూరు కార్పొరేషన్‌లో నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు కొల్లేపల్లి రాజు, చోడే వెంకట రత్నం, జాలా సుమతిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొల్లేపల్లి రాజు పేరును కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్, చోడే వెంకటరత్నం పేరును కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్ కుమార్, జాలా సుమతి పేరును కార్పొరేటర్ నాయుడు సోము శారద ఆమోదించారు. నూతన కోఆప్షన్ సభ్యులకు మేయర్ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కౌన్సిల్ సభ్యులు తమ వంతు కృషి చేయాలని కోరారు. బదిలీపై వచ్చి ఏలూరు నగరపాలక సంస్థలో బాధ్యతలు చేపట్టిన ఎస్ఈ ఇ.సురేంద్ర కృష్ణ, ఎంఈ ఇ.సురేంద్ర బాబు, డీఈ ఎండీ రజాక్‌లను కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు. కోఆప్షన్ సభ్యుల దరఖాస్తుల వివరాలను నగరపాలక సంస్థ కార్యదర్శి షిరాజ్ ఉద్దీన్ వెల్లడించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన కోఆప్షన్ సభ్యులకు బొకేలు ఇస్తున్న మేయర్ నూర్జహాన్

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అప్పనవీడు ఆటోలను అడ్డుకుంటున్న వేరే యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): అప్పనవీడు ఆటో డ్రైవర్లపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏలూరు నుంచి తిరిగివెళ్లే అప్పనవీడు స్టాండ్ ఆటో డ్రైవర్లను వట్లూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద అడ్డగించి ప్రయాణికులను దించేస్తున్న నగరబోయిన లీలా కృష్ణ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా అప్పనవీడు నుంచి ఏలూరు వచ్చి తిరిగి వెళ్లే ఆటో డ్రైవర్లను అడ్డగించి దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు త్రీ టౌన్ సీఐకి, ఏలూరు డీఎస్పీకి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. లీలాకృష్ణా అతని అనుచరులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో పోలీసు అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆరోపించారు. సమస్యను ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

20న సాంస్కృతిక కళా సమ్మేళనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆ సంస్థ 47వ కార్యక్రమంగా కళాకారుల సాంస్కృతిక కళా సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెదపాటి రామకృష్ణ, గండికోట రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేద కళాకారులకు ఆర్థిక సత్కారం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో జాహ్నవి లాలిత్య కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం నగరానికి చెందిన రామాంజనేయ నాట్య మండలి ఆధ్వర్యంలో పౌరాణిక నాటకం రాయబారం సెంట్రల్ సీన్ ప్రదర్శన ఉంటాయని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి పెట్టండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో నిర్వహించే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ చిరంజీవి నాయకులకు సూచించారు. ఏలూరులోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ, బీజేపీ, జనసేన ప్రజాప్రతినిధులు, నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో ఉపాధి

దెందులూరు: భవిష్యత్తు అంతా కంప్యూటర్‌పైనే ఆధారపడి ఉంటుందని యువత కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని గోపన్నపాలెం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి బ్రదర్ జోసెఫ్ కుమార్ అన్నారు. బుధవారం ఇనిస్టిట్యూట్‌లో యువతకు ఉచితంగా శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34-60	ములక్కాడలు	07,10
బెండకాయలు	34	కంద	50
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	40
కాకర కాయలు	348	కీరా దోస	38
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	132
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70-150
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	44-56	పాలకూర	15
దొండకాయలు	44	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	35-55	గోంగూర	07
గోరుచిక్కుడు	2	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణీ	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48



సరస్వతీ దేవి అలంకరణలో పవర్‌పేట రాజ్యలక్ష్మి, పవర్‌పేట కాశీ అన్నపూర్ణ, పత్తేబాద కనకదుర్గ, బావిశెట్టివారి పేట కనకదుర్గ

వాగ్దేవీ వందనం

- వైభవంగా సరస్వతి పూజలు
- చిన్నారులతో అక్షరాభ్యాసాలు



సరస్వతీ దేవి పూజల్లో పాల్గొన్న బాలలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్ర పర్వదినం సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు చేశారు. అమ్మవార్లకు సరస్వతి దేవి అలంకరణ చేశారు. చిన్నారులచే అక్షరాభ్యాస పూజలు, విద్యార్థులచే సరస్వతి పూజలు చేయించారు. కొత్తపేట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ మహిళా కమిటీ నిర్వాహకురాలు వెన్నెలకోట శ్రీనివాస్ హేమలత ఆధ్వర్యంలో సరస్వతి పూజ వైభవంగా నిర్వహించారు. బాల బాలికలతో పలకలపైన పుస్తకాలపై ఓం అక్షరం రాసి పూజను ప్రారంభించారు. అరిటాకుపై బియ్యం పోసి పసుపు, కుంకుమ, పువ్వులు, గంధము, అక్షింతలతో దీప, ధూప నైవేద్యాలతో వేద మంత్రాలతో సరస్వతి పూజ చేశారు. పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, పవర్‌పేట కాశీ అన్నపూర్ణమ్మవారికి, పత్తేబాద, బావిశెట్టివారిపేట కనకదుర్గమ్మవార్లకు, దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి, పవర్‌పేట బడేటి వారి వీధిలోని శ్రీ కొదండ రామాలయంలోని అమ్మవారికి సరస్వతి దేవి అలంకరణ చేశారు. 108 కమలం పుష్పాలతో విశేష పూజ చేశారు.

సోలార్ పవర్‌ప్లాంట్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలించి, తహసీల్దార్‌కు సూచనలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

ద్వారకాతిరుమల: మండలంలోని వెంకటకృష్ణాపురంలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. తొలుత ఆమె ద్వారకా తిరుమలలోని ఆర్‌ఎస్ నెంబర్ 47లో నాయీ బ్రాహ్మణ సంఘ కల్యాణ మండప నిర్మాణానికి కేటాయించిన అరెకరం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ తహసీల్దార్ జేవీ సుబ్బారావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట కృష్ణాపురానికి చేరుకొని సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం నిమిత్తం ఆర్‌ఎస్ నెంబర్ 385లోని స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు ఆమె పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గాలీబ్ సాహెబ్, ఆర్‌ఐ నాగరాజు, మండల సర్వేయర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

పెదపాడు: రైతులు ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ సూచించారు. పెదపాడు మండలంలోని తోటగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వచ్చిన తెగుళ్లను నిర్ధారించుకుని అధికారుల సలహాలతో మందులను పిచికారి చేయాలన్నారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని చెప్పారు. స్థానికులు కాట్రం సురేష్, పెద్దిరెడ్డి రమేష్, వ్యవసాయ సహాయకుడు అజయ్ పాల్గొన్నారు.

బాల కళాకారులకు సత్కారం

దెందులూరు: చిన్న వయస్సులోనే అసమాన ప్రతిభను ప్రదర్శించిన చిన్నారులందరూ అభినందనీయులని కనకదుర్గమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, ప్రభాకరరావు అన్నారు. బుధవారం రాత్రి గోపన్నపాలెంలో అసమానత ప్రతిభ కనబరిచిన చిన్నారి కళాకారులను ఆలయ కమిటీ, గ్రామస్తులు సత్కరించారు. దసరా మహోత్సవాల్లో కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు విశిష్ట ప్రతిభను కనబరిచిన సందర్భంగా వారిని సత్కరించారు.

పారిశుద్ధ్య పరిరక్షణ అందరి బాధ్యత

దెందులూరు: పారిశుద్ధ్య పరిరక్షణ అందరి బాధ్యతని ఎంపీడీఓ కే.శ్రీదేవి అన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ అంశంలో గురుతర బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ కార్యదర్శులందరూ ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎంపీడీఓ వారితో మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన

పెదపాడు: మండలంలోని కొత్తూరులో పోలీసు అధికారులు బుధవారం పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. నేడు ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంతో సైబర్ నేరాలు అధికమయ్యాయని సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే ఫోన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వ పథకం వచ్చిందని వ్యక్తిగత సమాచారాన్ని, ఆధార్ నంబరు, బ్యాంకు వివరాలను తెలియజేయాలని ఓటీపీ తెలపాలని వచ్చే ఫోన్ కాల్స్‌ను స్పందించవద్దని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే ఆ వివరాలను పోలీసు స్టేషన్‌కు తెలపాలని కోరారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో దూరప్రాంతాలకు వెళ్లే వారు ఇళ్లకు తాళం వేయడంతో పాటు, పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అటువంటి ఇంటిపై పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే సమయాల్లో సీసీటీవీ లింకులను పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించేలా సంబంధిత లింకుల వివరాలను పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 83329 59175, 95503 51100 నంబర్లకు తెలియజేయాలన్నారు.

NAME CHANGE

I, GUMMADI HADASSASANTHI W/o VIJAYKUMAR D.No:16-92/3, Vidya Nagar, Near Hanuman Temple, Eluru Mandal, Eluru District, Andhrapradesh. I State that my Name (Gummadi Hadassanthi) Passport No:M2296866 My Surname was Wrongly mentioned Geddam. I hereby declare that my Surname was GUMMADI (New name) But not Geddam (Old name). I therefore request the authorities to Consider my Surname was GUMMADI.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, ఐపీవోల ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

90102 23729

95055 08399

79955 66352

Office mail : tpgadvt@gmail.com